# కీర్తిశేషుని ఘోష

(వ్యంగ్య రచన)

= శ్రీ ఈరంకి వెంకటరావు =

కీర్తిశేషుడు మళ్ళీ మనలోకి వస్తా నన్నాడు. నేను రావద్దన్నాను. కీర్తిశేషుడికి కోపం వచ్చింది. ఇంక అక్కణ్ణించి ఒకటే వరసం ధోరణి మొదలెట్టాడు.

"అందుకనే ప్రపంచం అంటే నాకు వెగటు పుట్టింది. నేను బతికి వున్నన్నాళ్ళూ లోకంలో మహత్తర కార్యాలు చేశాను; అనేక ఉద్గ్రంథాలు వ్రాశాను; అనేక సంఘాలు అధోగతిపాలవకుండా కాపాడాను. నేను జీవించినన్నాళ్లూ గుడ్డి లోకం కానలేక పోయింది. నా బీదస్థితికి గాని, సంసారపు బాధలకు వి హృదయ పూర్వకంగా ఒక్కరూ సానుభూతి చూపలేక పోయారు. నా ఉద్గ్రంథాలు అచ్చువేయించడానికి అనేకులను బ్రతిమాలవలసి వచ్చింది. నా గ్రంథాల్ని కృతి ఇస్తానన్నప్పటికీ అప్పట్లో చాలామంది వాటి గొప్పదనాన్ని గుర్తించలేక పోయారు.

"కాని, ఏమిటో నేను జీవితం చాలించాక చూశాను. అబ్బ! లోకం మహా ఏడ్చింది నా కోసం. ఊరూరా, వాడవాడల్లోనూ సంతాపసభలే. అందరూ నా త్యాగాన్నీ, ఉదారాశయాల్నీ, సర్వమానవ సౌభ్రాతృత్వాన్నీ, మానవ సేవనూ, దేశసేవనూ అనేక వేల నోళ్ళ పొగిడేవారే. నేను చచ్చిపోయినాక నా పేర ఒక నిధిని పోగుచేసి నా కుటుంబాని కిచ్చారు. దానితో, నేను బతికి ఉండగా భీమా చేయలేదే అనే చింత పోయింది. అసలు డబ్బుంటే భీమా చేయడానికైనాను! ఏదో నా జీవితానంతర దినాలు చాలా బాగా వెళ్ళాయి. అయితే ఎవరు అనుభవించినట్టు. కుక్కగొడుగ. లోకం నాకిచ్చిన నీరాజనాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు వంటివి. అందుకనే అన్నాను లోకం గుడ్డిదని."

ఈ ధోరణి చూస్తుంటే నాకు మహా విసుగొచ్చింది. "మహాప్రభో! నీ కొక దణ్ణం. నువ్వు చాలా గొప్పవాడివి. లోకంలో నీ అంత గొప్పవాడు మరి ఇహ లేడని ఒప్పుకుంటాను. దయవుంచి ఇక్కడనుంచి దయచేసి నన్ను నిద్రపోనీ" అన్నాను.



"వెధవ నిద్ర! అందుకే మీరంతా అంటే నాకు మహా చెడ్డ యిది. మీ రంతా సోమరి పోతులు. ఇదుగో నేను చెప్పేది పూర్తిగా విను. నువ్వు చాలా మంచివాడివి. కాబట్టే ఇంతమంది వుండగా అందర్నీ వొదిలేసి నీ దగ్గర కొచ్చాను. చూశావ్! నేను బతికివున్నన్నాళ్లూ యమబాధ పడ్డాననుకో. నేను చాలాసార్లు అనుకున్నాను — కవిగా గాని, దేశసేవకుడుగా గాని పగవాడైనా తయారుకాకూడదని. కాని అది అప్పట్లో అంత మంచి అభిప్రాయం కాదులే. ఏమిటో జీవితంమీద చిరాకుపుట్టుకొచ్చి అప్పుడలా అనిపించేది. నేను బతికివున్నన్నాళ్ళూ మానవుల హృదయాలు కరుడుగట్టినట్టు కనిపించేవి. తోటిమానవుడు ఎంతో అవస్థలో వుంటే సహాయం లేకపోతే పోయె, కాస్త జాలన్నా లేదయ్యా.

"నేను ఏదో స్వయంకృషి, స్వయంసహాయం అనే అక్షరాల్ని పాటించేవాణ్ణి గాబట్టి నాకు ఒకరి అపేక్ష లేకపోయింది. నేను జీవించివున్నప్పుడు నాకే గనక సరియైన ప్రోత్సాహం ఇచ్చేవాళ్లున్నట్టయివుంటే, మన దేశానికి మరే నాయకుడూ చేయలేనంత సేవ చేసివుందును. ఏమయితే ఎందుకు? నేను పోయాక లోకం మహా ఏడ్చింది! అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లాడు పోయినప్పుడు విచారించే తల్లిలాగ అయిపోయింది లోకం. చివరకి నా కీర్తి మాత్రం నిలిచిపోయింది. నేనుమాత్రం లోకానికి దూరమైపోయాను. అందుకే నన్ను కీర్తిశేషు డన్నది లోకం."

చెవులోమోత ఎక్కువయింది "స్వామీ! నువ్వు కీర్తిశేషుడివే గాదు, కీర్తికాయుడివి గూడాను ఎందుకు నన్నిలా చంపుతావు. నిద్రపోనీ" అన్నాను నేను.

"మరేం లేదు. రెండు ముక్కలు నీతో చెప్పాలని వచ్చాను; కాస్త ఓపికపట్టు. మొన్న నా స్మారకసభలో పట్టపగలు అనేకమంది ప్రముఖుల ఎదుట నన్ను చెడపొగిడి, ఇప్పుడిలా విసుక్కుంటావేం? ఆ నాడు నీ నోటితో నువ్వే కదూ 'ఆ మహానుభావుడు మన కళ్లముందర తిరుగుతున్నంత

కాలమూ ఆయనగొప్పతనాన్ని మనం గుర్తించలేకపోయాం. అటువంటి మహనీయులు చస్తే మన కళ్ళు కగపడరు. ఒక వేళ అటువంటిదే జరిగితే మనం నిజంగా తరిస్తాము' అని ఏకధాటిగా చెప్పావు. మరి ఇప్పుడు నేను కనిపిస్తే అలా విసుక్కుంటావేం?

"ఇదుగో. నీకు కొన్ని ముఖ్యవిషయాలు చెబుతున్నాను. విను. ఈ నాటి కుర్రకారు ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఇప్పటివాళ్ళు ఏ పనీ సాధించలేకపోయినా మా కీర్తిని పాడుకుంటే నిజంగా తరిస్తారు. మా అడుగుజాడల్లో నడిస్తే వారి కింక కావలసిం దేముంది? లోకం అప్పుడే మా పురాతన పద్ధతులు వదిలేసి తన కిష్టమొచ్చిన మార్గాలు వెదుకుతోంది. అందుకే నాకు తలకాయనొప్పి. కొత్త మార్గాలు అన్వేషించినకొద్దీ. కొత్త చిక్కులు అనేకం అడ్డు తగులుతాయి. దాంతో మీ రెప్పటికీ బయలుదేరిన చోటే వుంటారు అనవసరశ్రమ. వృథాప్రయాస మాత్రం మిగులుతాయి.

"లోకం అప్పుడే నన్నేగాకుండా నా అభ్యుదయ మార్గాల్నికూడా మరిచిపోతోంది. నేను పుస్తకాల్లో వ్రాసింది ఎవరికీ పనికిరాకుండా పోతోంది. అనేకమంది బయలుదేరి ఊరికే—ఇట్టే—అనేక పుస్తకాలు రాస్తున్నారు. చాలామంది ఏదో దేశసేవ. సంఘసేవ అని ప్రజల్ని భ్రమింపజేసి నన్ను మరపింప జేస్తున్నారు.

"నేను కీర్తిశేషుణ్ణయాక నాముందు వారిని మరిచిపోయి నట్టే నావెనక కొంతమంది కీర్తిశేషులు బయలుదేరగానే నన్ను మరచిపోతున్నారు ప్రజలు. ఏదో ఇంకా పూర్వకాలం వాణ్ణి గాబట్టిన్నీ. నేను చేసిన సేవ కాస్తా కూస్తా గాదు గాబట్టిన్నీ ప్రజలు నన్ను అంతపూర్తిగా మరిచిపోలేక పోతున్నారు. ఇప్పటివాళ్ళల్లో మళ్లీ వెనకటి ఆవేశం తీసుకురావాలంటే. ఇంకా లోకం నన్నూ. నా సేవనీ మరిచిపోకుండా వుండాలంటే నేను మళ్ళీ ఇంకొక్కసారి వెనకటి జీవితాన్నే తొడుక్కుని రావాలి. ఇదివరకే నాకు పేరువచ్చేసింది గాబట్టి ఇహ ప్రజలు నన్ను చిన్నచూపు చూడకుండా. నాకు అమోఘంగా తోడ్పడుతారు. నేను వస్తాను. తప్పకుండా వస్తాను. ఈలోపుని ప్రజలు నన్ను మరిచిపోకుండా సభలు. సమావేశాలు జోరుగా జరిపి నన్ను వాళ్ళకి తరుచూ జ్ఞాపకం చేయిస్తూ వుండు—ఏం? ఏమంటావు? రమ్మంటావా?" అని అడిగాడు కీర్తిశేషుడు.

"బాబూ! నువ్వు దేహం లేకుండానే నన్నిలా బాధిస్తున్నావు: నీవు దేహం తాల్చివస్తే ఇంకెంత బాధపెడతావో? నా కన్న ఇంకా ముందువెనకలు ఆలోచించేవారు చాలామంది వున్నారు. వాళ్ళ నెవళ్ళనైనా అడుగు. లేకపోతే మీ కీర్తిశేషులందరూ ఒక సభచేసి తీర్మానం నెగ్గితే. నువ్వు కీర్తిశేషులందరి తరఫునా ప్రతినిధిగా రా. నన్నెందుకు బాధపెడతావు? నిద్రపోనీ" అన్నాను.

"అదుగో. అక్కడే నువ్వు పొరబడుతున్నావు. నాకు మిగిలిన కీర్తిశేషులతో పనిలేదు. వాళ్లందరూ అనవసరంగా పేరు సంపాదించి నా కీర్తిని అడుగంటేటట్లు చేస్తున్నారు. నేను లోకంలో ఉండగా కొన్ని కార్యాలు చెయ్యడం మరిచిపోయాను. అవన్నీ యీమధ్య జ్ఞాపకం వస్తున్నాయి. ఆ పనులుగూడా చేసేశానంటే నాకీర్తి మిన్నుముట్టుతుంది. లోకం నన్ను చస్తే మరిచిపోలేదు.

"ఇదుగో. నీకు తెలియదుగాని రోజులు గడిచినకొద్దీ మీవాళ్ళ తెలివితేటలు సన్నగిలుతున్నాయి. లేకపోతే ప్రతీ చచ్చిన వాణ్ణీ. వాడికి కీర్తి వున్నా లే-పోయినా. కీర్తిశేషుడనడమేమిటి? ఏ శుద్ధ మొద్దావతారం చచ్చినా. ఏ జులాయి వాడు చచ్చినా. ఏ అవినీతి పరుడు చచ్చినా—వాళ్ళందర్నీ కీర్తిశేషు డంటూవుంటే ఇంక ఆ పదానికి విలువెక్కడిది? అటువంటప్పుడు అసలయిన కీర్తిశేషులు వాళ్ళో. నేనో తెలియకుండా పోతుంది. నేను ఎళ్ళీ జీవందాల్చి కీర్తిశేషు లంటే ఎవరో ప్రపంచానికి బ్రహ్మాండంగా చాటే ఒక పుస్తకాన్ని వ్రాస్తాను. ఈలోగా దానికి కావలసిన సరంజామంతా సిద్ధం చెయ్యి. అయినా లోకంమీద యీ మధ్య పుస్తకాలు అట్టే అంతపని చెయ్యడం లేదు. డాబుగా నాలుగు కబుర్లు చెప్పి. చెప్పిందాన్నే మళ్ళీ ఇంకోలాగ తిప్పి చెప్పేవాళ్ళ వెనకాలే పడుతున్నారు ప్రజ. మాటలు అనవసరంగా ఖర్చుపెట్టకుండా లోకాన్ని పుస్తకాలద్వారా లోపల్నుంచి మరమ్మతు చేసుకొద్దామనే మా ఆశయాలు యీనాటివాళ్ళకి నచ్చటం లేదు.

"అందుకని నేను మళ్ళీ వచ్చాక పుస్తకం వ్రాయడం అనవసరమేమో ననిపిస్తూంది. కాబట్టి ఒహపని చేస్తాను. ఈ మధ్య పత్రికా ప్రచారం. పత్రికల్లో వ్రాసింది వెర్రిగా నమ్మడం ఎక్కువై పోయింది. అందువల్ల 'కీర్తిశేషుడు' అనే ఒక పత్రిక స్థాపించి దాని ద్వారా లోకానికి ఎవడు అసలైన కీర్తిశేషుడో. ఎవడు నకిలీ కీర్తిశేషుడో అమోఘంగా చాటుతాను. ఈ ఉద్దేశ్యాలు ఒట్టి గాలిగోపురా లనుకోకు. నేను ఎప్పటికయినా లోకంలోకి మళ్ళీవచ్చి యీ మధ్య పాడయిపోయిన ప్రపంచాన్నీ-ప్రజల్నీ మళ్ళీ బాగుచేస్తాను. ఏమంటావు?" అన్నాడు కీర్తిశేషుడు.

నేను కీర్తిశేషుడికి బాగా పాఠం చెప్పదలచుకున్నాను. చెడిన నిద్ర ఎలాగా చెడింది అని ఇలాగన్నాను.

"ఇంతసేపూ నువ్వు మాట్లాడావు. ఏదో నీ స్వంతగోడు వెళ్ళబోసుకున్నావు. ఇంక నన్ను మాట్లాడనియ్యి. నువ్వు ఇదివరకు ఘనకార్యాలే చేశావు. కాస్తోకూస్తో కీర్తి పొందావు. అయితే, లోకం పుట్టింది మొదలు ఇప్పటివరకూ, ఇకముందూ ఎవరూ నీలాగ ఘనకార్యాలు చెయ్యలేదనిగాని, చెయ్యబోరని గాని అనుకోకు. ప్రతికాలంలోనూ మహామహులు బయలుదేరి ఏదో ఒక విషయంలో కొన్ని మహత్తర కార్యాలు చేస్తున్నారు. అయితే లోకం కొన్నాళ్ళు నీకోసం మహా యేడ్చి, ఇప్పుడు మెల్లిమెల్లిగా నిన్ను మరిచిపోతున్నదంటే ఆ తప్పు ప్రజలది గాదు; కాలానిది.

తరువాత పూర్వకాలంవాళ్ళే అన్నిటికీ సమర్థులు, ఇప్పటివాళ్ళు ఎందుకూ పనికిరారనుకోవడం శుద్ధ పొరబాటు. కొంచెం ఆలోచించి చూస్తే ఇప్పటివాళ్ళ గూడా ఎంత గట్టివాళ్ళో నీకే తెలుస్తుంది.

ఇంతకూ నీ బాధ ఏమిటంటే. కీర్తిశేషుడనే పదానికి సరియైన అర్థం, విలువా లేదంటావు. ఆ పదానికి సరియైన అర్థం కల్పించడానికి, ఇదివరకు నువ్వు మరిచిపోయిన లోకమరమ్మత్తులు కొన్ని చెయ్యడానికి మళ్ళీ అవతరిస్తానంటావు. కాని నువ్వు రానక్కరలేదు. నువ్వు గాదుగదా, నీలాంటివారు అనేకమంది ప్రయత్నించినా ఆ పదానికి అర్థం అంతే. అది ఛస్తే మారదు. కీర్తివున్నవాడు చచ్చినా, లేనివాడు చచ్చినా, వాడు చచ్చిన తరువాత మాత్రం కీర్తిశేషుడవకమానడు. అది లోకాచారం; లోకసహజం.

నిజంగా నీ బాగు కోరి చెబుతున్నాను. కాబట్టి నువ్వు మళ్ళీ ప్రజల కంట బడకుండా నీకు చివరకొచ్చిన పేరు నిలబెట్టుకోవడం చాలా ఉత్తమం. నీ కాలంనాటికి, యీ కాలంనాటికీ అప్పుడే పరిస్థితులూ, వూహలూ అన్నీ మారిపోయాయి. ఏదో అవతరించి ఇంకా గొప్పపేరు సంపాదించుకోందామని చూస్తున్నావేమో. అది వట్టిమాట. కాబట్టి ఇంక శలవు తీసుకో, నన్ను నిద్రపోనీ" అన్నాను.

కీర్తిశేషుడు తెల్లబోయాడు. అతని ఆశలన్నీ అడుగంటాయి. ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. నాకిప్పుడు నిజంగా నిద్రాభంగమయింది. లేచి చూసేటప్పటికి ఎవరూ లేరు. వేసిన తలుపులు వేసినట్లే వున్నాయి. అయితే ఇదంతా కలా?

